
ప్రజాశక్తి
గురువారం 20 జులై 2023
5
విజయనగరం



వైయస్ఆర్ పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

2023 సంవత్సరానికి సంబంధించి వైయస్ఆర్ జీవిత సాఫల్య పురస్కారాలు, వైయస్ఆర్ అచీవ్‌మెంట్ అవార్డులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సెట్విజ్ సిఇఒ రామగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. కళలు, సాంఘిక కార్యక్రమాలు, ప్రజావ్యవహారాలు, సైన్సు, ఇంజినీరింగ్, వాణిజ్యం, పరిశ్రమలు, ఔషధాలు, సాహిత్యం, విద్య, పౌర సేవ, క్రీడలు వంటి వాటిలో రాణించిన, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో విశిష్ట ప్రతిభ కనబరిచిన వారికి పురస్కారాలు అందించనున్నట్లు తెలిపారు. గ్రామ/మునిసిపల్ అభివృద్ధిలో చేసిన కృషి, స్వచ్ఛంద సేవా సంస్థలు, లాభాపేక్ష లేని సంస్థలకు సంబంధించిన వ్యక్తులు వ్యక్తిగతంగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఎంపికయిన విభాగానికి సంబంధించిన వివరాలు జతచేసి దరఖాస్తులను విజయనగరంలోని సెట్విజ్ కార్యాలయంలో ఆగస్టు ఐదో తేదీలోగా అందజేయాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9849913080 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ముంజేరుకే బీమా

- పంటల బీమాకు ఒకే ఒక్క గ్రామం
- మిగతా గ్రామాల రైతులంతా సుభిక్షమేనట
- సర్కారు లెక్కలకు ఉలిక్కిపడుతున్న రైతాంగం


పంచపాండవులెంతమంది అంటే మంచం కోళ్లలా ముగ్గురన్నారంటూ రెండు చేతి వేళ్లు చూపించి ఒకటి మూసిచేశాడంట వెనకటికి ఓ వ్యక్తి. 2022 ఖరీఫ్ పంటల బీమా ఎంపికలో సర్కారు లెక్క అచ్చం అలాగే ఉంది. గతేడాది జిల్లా వ్యాప్తంగా అనేక చోట్ల వర్షాభావం, అకాలవర్షాల వల్ల పంటనష్టం వాటిల్లింది. కానీ అధికారులు మాత్రం ఒక్క ముంజేరు గ్రామ రైతులనే పంటల బీమాకు ఎంపిక చేయడం గమనార్హం. దీంతో అధికారుల తీరుపై మిగతా రైతులు అగ్గిమీద గుగ్గిలమవుతున్నారు.

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

అతివృష్టి, అనావృష్టి కారణంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం నష్టపరిహారం చెల్లిస్తున్న విషయం విదితమే. ఇటువంటి బీమా సదుపాయం కేవలం నాలుగు (వరి, మొక్కజొన్న, పత్తి, నువ్వులు) పంటలకు మాత్రమే ప్రభుత్వం కల్పించింది. జిల్లా వ్యాప్తంగా సుమారు అన్ని పంటలు కలుపుకుని దాదాపు 4.50 లక్షల ఎకరాలు సాగవుతున్నా, వరి, మొక్కజొన్న, పత్తి, నువ్వుల పంటలు సాగుచేసే రైతులు ఇ-క్రాప్ బుకింగ్ ప్రకారం 3.60 లక్షల మంది ఉంటారని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. వీరిలో కేవలం భోగాపురం మండలం ముంజేరు గ్రామంలో పంటల దిగుబడి తక్కువగా వచ్చినందున 324 మందికి మాత్రమే బీమా సదుపాయం వర్తించినట్టు ప్రభుత్వం చెబుతోంది. గడిచిన ఐదేళ్ల సాధారణ దిగుబడి సరాసరి కన్నా తక్కువగా ఉత్పత్తి కాని, అతివృష్టి, లేదా అనావృష్టి వల్ల 30 శాతం కన్నా ఎక్కువ నష్టం జరిగినా బీమా వర్తిస్తుందని అధికారులు చెబుతున్నారు. ఈ లెక్కన మన జిల్లా సరాసరి దిగుబడి ఎకరాకు 1432 కిలోలు రావాల్సి ఉంది. కానీ, ముంజేరులో సుమారు వెయ్యి ఎకరాల విస్తీర్ణంలో ఎకరాకు 921 కిలోలు మాత్రమే దిగుబడి రావడంతో బీమా సదుపాయం వర్తించినట్టు, మిగిలిన జిల్లా అంతటా 2077 కిలోల వరకు దిగుబడి వచ్చినట్టు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. ఈనేపథ్యంలో కేవలం ముంజేరులోని 324 మంది రైతులకు రూ.50,14,290 అందాయి. దీంతో మిగిలిన గ్రామాల రైతులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. వాస్తవానికి 2022లో వరి దిగుబడి కాస్త ఎక్కువ వచ్చినప్పటికీ అన్ని చోట్లా ఆ పరిస్థితి లేదు. చాలా చోట్ల వర్షాభావంతో చివరిదశలో వరి దెబ్బతింది. అకాల వర్షాలు కొంతమేర దెబ్బతీశాయి. అధిక వర్షాలకు పత్తిపంట వందలాది ఎకరాల్లో నీటమునిగిపోయింది. మొక్కజొన్న కూడా వర్షాలకు తడిసి నాశనమైంది. ఇవేవీ అధికారులు పట్టించుకోకుండా అధికారులు సాగునీటి వసతులు ఉన్నచోట పరిశీలించి, సగటు లెక్కలు వేసి ఉంటారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



గతేడాది గరివిడి మండలం గదబవలసలో మొలకెత్తిన మొక్కజొన్న కంకులు (ఫైల్)





పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, జెసి మయూర్ అశోక్

ఆర్మీ ర్యాలీ ఏర్పాట్ల పరిశీలన

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

నగరంలో గురువారం నుంచి ఆగస్టు రెండో తేదీ వరకు అగ్నిపథ్ ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తిచేసినట్టు కలెక్టర్ నాగలక్ష్మి వెల్లడించారు. నగరంలోని పోలీసు శిక్షణ కళాశాల మైదానంలో రిక్రూట్‌మెంట్ ర్యాలీకి చేసిన ఏర్పాట్లను బుధవారం సాయంత్రం జెసి మయూర్ అశోక్, ఆర్మీ రిక్రూటింగ్ అధికారి జి.ఎస్.రంధావా, వినయ్ కుమార్‌తో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ ర్యాలీకి శ్రీకాకుళం నుంచి ఎన్టిఆర్ జిల్లా వరకు సుమారు 8,600 మంది అభ్యర్థులు హాజరు కానున్నారని కలెక్టర్ చెప్పారు. తొలిరోజు 970 మంది అభ్యర్థులు హాజరుకానున్నారని తెలిపారు. వర్షాలు కురిస్తే పరుగుపందెం నిర్వహణకు ప్రత్యామ్నాయ ప్రదేశ గుర్తింపు తదితర అంశాలపై కలెక్టర్ అధికారులతో సమీక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఆర్.శ్రీరాములు నాయుడు, డిఆర్‌డిఎ పీడీ కళ్యాణ చక్రవర్తి, సెట్విజ్ సిఇఒ రాంగోపాల్, రోడ్లు భవనాల శాఖ ఇఇ వెంకటరమణ, డిఇ శ్రీనివాస్, ఇపిడిసిఎల్ అధికారులు పాల్గొన్నారు.

కచ్చితమైన ఓటర్ల జాబితా

ప్రజాశక్తి-విజయనగరం

కచ్చితమైన వివరాలతో ఓటర్ల జాబితాను రూపొందించేందుకు రాజకీయ పార్టీలు తమవంతు సహకారాన్ని అందించాలని కలెక్టర్ నాగలక్ష్మి కోరారు. ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో బుధవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 21 నుంచి ఇంటింటి సర్వే ప్రారంభమవుతుందని చెప్పారు. రాజకీయ పార్టీలు తమ బూత్ ఏజెంట్ల జాబితాలను ముందే తమకు అందజేయాలని కోరారు. వైసిపి నాయకులు రొంగలి పోతన్న, టిడిపి నాయకులు ఐవిపి రాజు, కాంగ్రెస్ నాయకులు సరగడ రమేష్, సుంకరి సతీష్, ఆమ్ ఆద్మీ నాయకులు కోటేశ్వరరావు, తదితరులు పలు సూచనలు చేశారు. సమావేశంలో జెసి మయూర్ అశోక్, డిఆర్ఒ ఎం.గణపతిరావు పాల్గొన్నారు.

ఓటు తొలగించేముందు నోటీసు

ఓటర్ల జాబితా నుంచి ఎవరిదైనా ఓటు తొలగించే ముందు తప్పనిసరిగా నోటీసు ఇవ్వాలని జెసి మయూర్ అశోక్ ఆదేశించారు. మరణించిన ఓటర్ల పేర్లను కూడా, సంబంధిత కుటుంబానికి నోటీసు ఇచ్చిన తరువాత మాత్రమే తొలగించాలని స్పష్టం చేశారు. నియోజకవర్గంలోని బిఎల్ఒ కలెక్టరేట్ సమావేశ మందిరంలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. జెసి మాట్లాడుతూ ప్రతి ఓటరుకు కచ్చితమైన చిరునామా, డోర్ నెంబరు ఉండాలని, దీనికి అనుగుణంగా ఓటర్ల జాబితాలను సవరించాలని చెప్పారు. కార్యక్రమంలో ఇఆర్ఒ, ఎస్‌డిసి సూర్యనారాయణ, తహశీల్దార్ కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



శిక్షణలో మాట్లాడుతున్న జెసి మయూర్ అశోక్

విఆర్ఎల సమస్యలపై నేడు, రేపు రిలే నిరాహార దీక్షలు

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

విఆర్ఎల సమస్యలపై గురు, శుక్రవారాల్లో మండల కేంద్రాల్లో రిలే నిరాహార దీక్షలు చేపడుతున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షులు కె.గురుమూర్తి తెలిపారు. ఈ మేరకు విఆర్ఎల సమస్యలను పరిష్కరించాలని బుధవారం స్థానిక డిప్యూటీ తహశీల్దార్‌కు వినతి అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విఆర్ఎలకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఏ ఒక్క హామీనీ అమలు చేయలేదన్నారు. పైగా ఇప్పటివరకు అమల్లో ఉన్న టిఎ, డిఎలను రద్దుచేసి తిరిగి తమ దగ్గర నుంచి రికవరీ చేసిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. విఆర్ఎలకు కనీస వేతనాలు అమలు చేయాలని, నామినీలను రెగ్యులర్ విఆర్ఎలుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. అర్హతను బట్టి విఆర్ఒగా ప్రమోషన్లు ఇవ్వాలన్నారు. సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని, డిఎ రికవరీ ఉత్తర్వులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు.రిలే నిరాహార దీక్షలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో విఆర్ఎల మండల కార్యదర్శి గోపాల్, సభ్యులు సన్యాసప్పడు, జయరాం, వీరాస్వామి, ఆది తదితరులు పాల్గొన్నారు.

జగనన్నా.. పుస్తకాలు ఎక్కడన్నా..?

- ఇంటర్ పాఠ్యపుస్తకాలపై చేతులెత్తేసిన ప్రభుత్వం
- ఆందోళనలో విద్యార్థులు

ఇంటర్ విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాల పంపిణీపై ప్రభుత్వం చేతులెత్తేసింది. ఈ ఏడాది పాఠ్య పుస్తకాలు పంపించలేమంటూ ఇంటర్మీడియట్ బోర్డుకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్టు సమాచారం. ఇంటర్మీడియట్ విద్యాసంవత్సరం ప్రారంభమై నెల రోజులు గడిచిపోయాయి. ఇప్పటికీ ప్రభుత్వం జూనియర్ కళాశాలల విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు అందించలేదు. పుస్తకాల ముద్రణపై స్పష్టత కొరవడటంతో పుస్తకాలు అందే పరిస్థితి కన్పించట్లేదు. జిల్లాల విభజన తర్వాత ఉమ్మడి జిల్లా పరిధిలో స్టాక్ ఉన్న కొన్ని పుస్తకాలను అరకొరగా విద్యార్థులకు పంపిణీ చేసి అధికారులు చేతులు దులుపుకున్నారు. పుస్తకాలు లేకుండా తమ పిల్లలు ఎలా చదువుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. వేల రూపాయలు వెచ్చించి బహిరంగ మార్కెట్లో కొనుగోలు చేసే అవకాశం లేక ఇబ్బందులు పడుతున్నారు.

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లాలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థులు సుమారు 20 వేల మంది ఉన్నారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 25 వేల మందిపైగా ప్రభుత్వ కాలేజీల్లో ఉన్నారు. ప్రభుత్వం సకాలంలో పాఠ్య పుస్తకాలు పంపిణీ చేయకపోవడంతో గతేడాది సీనియర్ల వద్ద సేకరించిన పుస్తకాలను జూనియర్లకు అందజేశారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో పాత పుస్తకాల ద్వారానే విద్యార్థులు చదువులు కొనసాగిస్తున్నారు. ఉమ్మడి విజయనగరం జిల్లా పరిధిలోని ప్రభుత్వ, ఎపిఆర్‌జెసి, కెజిబివి, ఎపి మోడల్, సాంఘిక సంక్షేమ, ఎపి ట్రైబల్ వెల్ఫేర్ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. ఆయా కళాశాలలో విద్యనభ్యసించే విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా పాఠ్యపుస్తకాలు అందించాల్సి ఉంది. జిల్లాల విభజన తర్వాత ప్రతి మండలంలో ఓ బాలికల జూనియర్ కళాశాలను (హైస్కూల్ ప్లస్) ఏర్పాటు చేశారు. వీటిలో చేరిన విద్యార్థులకు కూడా ప్రభుత్వమే ఉచితంగా పుస్తకాలు అందించాలి. దీనికితోడు జిల్లాలో ఇంటర్‌బోర్డు గుర్తింపు ద్వారా నడుస్తున్న అన్ ఎయిడెడ్, ప్రయివేట్ ఒకేషనల్ జూనియర్ కళాశాలల్లో చదివే విద్యార్థులకూ ప్రభుత్వమే పాఠ్యపుస్తకాలు ముద్రించి విక్రయించాల్సి ఉంది. ప్రభుత్వం పంపిణీ చేయకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులపై ఆర్థిక భారం పడింది. పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు కలిపి సుమారు రూ.2 వేలకు ఖర్చు అవుతుంది.



విజయనగరంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల

ఇంటర్ విద్యపై ప్రభుత్వ నిర్లక్ష్యం

విద్యారంగంలో మార్పులు తీసుకొచ్చి అభివృద్ధికి కృషి చేస్తున్నామంటూ రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలు నేతిబీర చందంగా మారాయి. విద్యా దీవెన, అమ్మ ఒడి పథకాల పేరుతో నగదు అందజేస్తున్నామంటూ ప్రచారం చేస్తోంది. విద్యార్థుల అభ్యసనలో కీలకమైన పాఠ్యపుస్తకాలు అందజేయడంలో తీవ్రమైన నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తోంది. కరోనా వైరస్ కారణంగా అమలు చేసిన లాక్‌డౌన్. ఫలితంగా ప్రభుత్వ కళాశాలల్లో ఉత్తీర్ణత శాతం గణనీయంగా పడిపోయింది. గతేడాది ఇంటర్మీడియట్ పరీక్షల ఫలితాల్లో జిల్లా వెనుకబడిన విషయం విదితమే. గత అనుభవాల నుంచి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందించేందుకు ప్రభుత్వం చొరవ చూపించాల్సి ఉన్నా, పూర్తి భిన్నంగా వ్యవహరించడం విమర్శలకు దారి తీస్తోంది.

పాఠ్య పుస్తకాలు అందించాలి

రాష్ట్ర ప్రభుత్వం ఇంటర్ విద్యార్థులకు ఉచితంగా పాఠ్య పుస్తకాలు అందిస్తామని ప్రకటించి, ఇప్పుడు ఇవ్వలేమని చేతులెత్తేయడం అన్యాయం. పేద విద్యార్థులు వేల రూపాయలు పెట్టి ఎలా కొనుగోలు చేయగలరు?. పాఠ్య పుస్తకాలు లేకపోవడం వల్ల విద్యార్థుల చదువుకు ఆటంకంగా మారింది. వెంటనే ప్రభుత్వం పాఠ్య పుస్తకాలు పంపిణీ చేయాలి.

- పి.రామ్మోహన్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి

న్యాయవాదుల నిరసన

ప్రజాశక్తి- శృంగవరపుకోట


తక్షణమే న్యాయవాదుల పరిరక్షణ చట్టం అమల్లోకి తెచ్చి న్యాయవాదులపై దాడులు జరగకుండా నివారించాలని ఎస్.కోట బార్ అసోసియేషన్ న్యాయవాదులు డిమాండ్ చేశారు. కృష్ణా జిల్లా అవనిగడ్డ కోర్టుకి చెందిన న్యాయవాది జి.శ్రీనివాసరావుపై హత్యాయత్నాన్ని ఖండిస్తూ ఎస్.కోట న్యాయవాదులు బుధవారం విధులు బహిష్కరించారు. ఈ సందర్భంగా న్యాయవాదుల సంఘ అధ్యక్షుడు అల్లు సత్యాజీ, కార్యదర్శి డబ్ల్యు.ఎన్. శర్మ మాట్లాడుతూ రాష్ట్రంలో కూడా న్యాయవాదుల పరిరక్షణ చట్టాన్ని అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు గేదెల ప్రకాష్, బి.త్రిమూర్తులు, టీవీఆర్ మూర్తి, బి.సత్యనారాయణ, ఆర్.సత్యనారాయణ, బి.వెంకటరావు, ఎం.అనూరాధ, ఎం.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీరమణ మృతికి సంతాపం

ప్రజాశక్తి-విజయనగరం

మిధునం కథా రచయిత, సంపాదకులు శ్రీరమణ మృతి తెలుగు సాహితీ లోకానికి తీరనిలోటని సహజ సంస్థ అధ్యక్షులు ఎన్‌కె బాబు ఒక ప్రకటనలో సంతాపం తెలియజేశారు. అనేక హాస్యరచనలు, కథలు రాసి, తెలుగు సాహితీ లోకాన్ని సుసంపన్నం చేసిన రచయితగా అభివర్ణించారు, శ్రీరమణ రాసిన సింహాచలం సంపంగమొగ్గలు, సత్య స్టాలిన్, శ్రీరమణ హాస్యం, మిధునం, మొదలగు రచనలు అతనిని చిరాయువుగా సాహితీ లోకంలో నిలుపుతాయని పేర్కొన్నారు. పిడెలు నాయుడు గారు అనే పుస్తకావిష్కరణ సభలో శ్రీరమణతో కలిసినప్పటి అనుభవాలను గుర్తు చేసుకున్నారు. శ్రీరమణ మృతికి ద్వారం దుర్గా ప్రసాదరావు, చాగంటి తులసి సంతాపాన్ని తెలియజేశారు.

విద్యార్థి ఆత్మహత్య



సందీప్ (ఫైల్)

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

స్థానిక వైఎస్ఆర్ నగర్‌కు చెందిన ఇమంది సందీప్ (19) డిప్లొమా పరీక్షల్లో ఫెయిల్ కావడంతో తల్లిదండ్రులు ఏమైనా అంటారన్న భయంతో బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం.. సందీప్ గజపతినగరంలో ఓ ప్రయివేట్ కళాశాలలో డిప్లొమా ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. 15 రోజుల క్రితం వెలువడిన డిప్లొమా ఫలితాల్లో సందీప్ ఫెయిల్ అయ్యాడు. మృతుడు సందీప్ ఈ విషయం తల్లిదండ్రులకు తెలియకుండా గోప్యంగా ఉంచాడు. డిప్లొమా ఫలితాలు వచ్చినట్లు తల్లిదండ్రులకు తెలియడంతో తనను ఏమైనా అంటారేమోనన్న భయంతో సందీప్ ఈనెల 17వ తేదీ రాత్రి 8 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. అనంతరం తన తన మిత్రుడు సెల్‌ఫోన్‌కు తల్లిదండ్రులు ఏమైనా అంటారేమోనన్న భయంతో ఆత్మహత్య చేసుకుంటున్నట్లు మెసేజ్ పంపించాడు. ఈ సమాచారాన్ని ఆ మిత్రుడు.. సందీప్ కుటుంబ సభ్యులకు తెలియజేశాడు. దీంతో కుటుంబ సభ్యులు సందీప్ ఆచూకీ కోసం పరిసర ప్రాంతాల్లో వెతికినప్పటికీ జాడ తెలియకపోవడంతో సందీప్ తండ్రి సూర్యప్రకాశరావు టూ టౌన్ పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశాడు. మృతుడు తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. బుధవారం వైఎస్ఆర్ నగర్ సమీపంలో ఓ నేలబావిలో సందీప్ మృతదేహం లభ్యమైంది. సందీప్ కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

సెప్టెంబర్ 15 నాటికి ప్రాధాన్యత భవనాలన్నీ పూర్తిచేయాలి

లక్ష్యాలను చేరకుంటే చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరం

ప్రభుత్వ ప్రయారిటీ భవనాలైన సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ క్లినిక్ నిర్మాణాలు సెప్టెంబర్ 15 నాటికి ఎట్టి పరిస్థితుల్లోనూ పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. సెప్టెంబర్ 30 నుంచి ఈ భవనాల నుంచే కార్యాలయాలు పనిచేయాలని స్పష్టంచేశారు. లక్ష్యాలను చేరని వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి శుక్రవారం దశల వారీగా అప్‌డేట్ చేయాలని, పురోగతి కనపడాలని సూచించారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో బుధవారం ఎంపిడిఒలు, డిఇలు, ఎఇలతో ప్రయారిటీ భవనాల పురోగతిపై మండల వారీగా సమీక్షించారు. గతంలో బిల్లుల చెల్లింపులు కాలేదని ఆలస్యం అయ్యాయని చెప్పేవారని, ప్రస్తుతం బిల్లులన్నీ పెండింగ్ లేకుండా చెల్లించామని తెలిపారు. ప్రతి మండలం నుండి లక్ష్యాలను పూర్తి చేయడానికి వారి కార్యాచరణ ప్రణాళికను, టైంలైన్‌ను చెప్పాలన్నారు. చెప్పిన గడువులోగా పూర్తి చేయని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. చెల్లింపులు మొత్తం జరిగినా పనులు ఎందుకు పూర్తి కావడం లేదని ప్రశ్నించారు. ఏజెన్సీలతో మాట్లాడి ఎప్పటికి పూర్తి చేస్తారో టైంలైన్ తీసుకొని, వారితో నిరంతరం పని చేయించాలని ఆదేశించారు. జులై నెలాఖరికి అన్నిటిని పూర్తి చేయడానికి ప్రణాళికలు వేసుకోవాలని సూచించారు. ఫ్లోరింగ్, పెయింటింగ్, ఎలక్ట్రిసిటీ, తలుపులు, కిటికీలు అన్నీ పూర్తయ్యాకే కంప్లీషన్‌లో అప్లోడ్ చేయాలన్నారు. బిల్లులను వెంటనే అప్లోడ్ చేయాలనీ, ఆలస్యం చేస్తే సంబంధిత అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. పంచాయతీరాజ్ ఎస్ఇ ప్రతి రోజూ ప్రోగ్రెస్‌ను సమీక్షించాలని, వారానికి ఒకసారి పూర్తి నివేదిక, ఖర్చు చేసిన నిధుల వివరాలను తనకు సమర్పించాలని ఆదేశించారు. ప్రతి రోజు క్షేత్ర స్థాయి తనిఖీలు నిర్వహించాలని, మెటీరియల్ కొరత లేకుండా, చూడాలని సూచించారు. వ్యవసాయ పనులు మొదలైనందున ఆర్‌బికెల్లో విత్తనాలు, ఎరువులు నిల్వ చేసుకునేలా స్థలం అవసరం ఉందని, ఆర్‌బికెలపై దృష్టి పెట్టి యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని సూచించారు. గడపగడపకు మన ప్రభుత్వం కింద చేపట్టిన పనులకు స్థానిక ఎమ్మెల్యేలతో చర్చిస్తూ వెంటనే మొదలు పెట్టాలని, వాటి బిల్లులను అప్లోడ్ చేయాలని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

నాన్ ప్రయారిటీ పనులకు మండలానికి రూ.60 లక్షలు

నాన్ ప్రయారిటీ పనులకు సంబంధించి ఒక్కో మండలానికి ఉపాధి హామీ నిధులతో రూ.60 లక్షల వరకు ఖర్చు చేసే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందని కలెక్టర్ తెలిపారు. ఈ పనులకు కూడా రెండు రోజుల్లో ప్రతిపాదనలను పంపించాలని ఎంపిడిఒలకు సూచించారు. ఈ నిధులతో సిసి రోడ్లు, బిటి రోడ్లు, డ్రెయిన్లు నిర్మించాలని తెలిపారు. సమావేశంలో జిల్లా పరిషత్తు సిఇఒ రాజ్ కుమార్, సిపిఒ బాలాజీ , డిపిఒ శ్రీధర్ రాజా, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ ఉమాశంకర్, పంచాయతీరాజ్ ఎస్ఇ గుప్తా, జిఎస్‌డబ్ల్యు జిల్లా కో-ఆర్డినేటర్ నిర్మలాదేవి, తదితరులు పాల్గొన్నారు.

పరిమళించిన మానవత్వం

బాలిక వైద్యానికి రూ.4 లక్షలు సాయమందించిన వాసు విద్యాసంస్థలు

ప్రజాశక్తి- బొబ్బిలి

వాసు విద్యా సంస్థలు మానవత్వాన్ని చాటుకున్నాయి. తమ కళాశాలలో పని చేస్తున్న కంప్యూటర్స్ అధ్యాపకులు బి.శ్రీనివాసరావు కుమార్తె మోక్షశ్రీ క్లోమగ్రంధి వ్యాధితో బాధ పడుతుంది. హైదరాబాద్ ఎఐజి ఆసుపత్రిలో చికిత్స పొందగా శస్త్ర చికిత్స చేయాలని, వైద్యానికి రూ.4లక్షల వరకు ఖర్చు అవుతుందని వైద్యులు చెప్పడంతో వైద్యం చేపించుకునే స్తోమత లేకపోవడంతో వాసు విద్యా సంస్థల యాజమాన్యానికి తెలిపారు. దీనికి స్పందించిన యాజమాన్యం నుంచి కొంత విరాళం, వాసు, శ్రీవిద్యా జూనియర్ కళాశాలలు, విజేత హైస్కూల్, బొబ్బిలి, పార్వతీపురంలో ఉన్న ఎస్ఎస్ఎస్ డిగ్రీ కళాశాలల్లో పని చేస్తున్న సిబ్బంది, చదువుతున్న విద్యార్థులు విరాళాలు సేకరించి టిడిపి నియోజకవర్గ ఇంచార్జి బేబినాయన చేతులు మీదుగా బాలిక తండ్రి శ్రీనివాసరావుకు అందజేశారు. బాలిక వైద్యానికి బేబినాయన కూడా ఆర్థిక సహాయం చేశారు. కార్యక్రమంలో వాసు విద్యా సంస్థల వ్యవస్థాపకులు రౌతు రామమూర్తి, కరస్పాండెంట్ రౌతు వాసుదేవరావు పాల్గొన్నారు.



ఆర్థిక సాయమందిస్తున్న బేబినాయన, రౌతు రామమూర్తి

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని 34వ డివిజన్‌లో వైఎస్ఆర్ కాలనీ, ప్రదీప్‌నగర్ ప్రాంతాల్లో రూ.24 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి శంకుస్థాపన చేశారు. వైఎస్ఆర్ నగర్‌లో రూ.12 లక్షలతో, ప్రదీప్‌నగర్‌లో 12 లక్షలతో ఏర్పాటు చేయనున్న రహదారి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి మాట్లాడుతూ శంకుస్థాపనల మాస మహోత్సవాలలో భాగంగా ప్రదీప్‌నగర్, వైఎస్ఆర్ నగర్‌లో అభివృద్ధి పనులు ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. అన్ని ప్రాంతాలలో గతంలో గుర్తించిన పలు సమస్యలను పరిష్కరించే దిశగా అభివృద్ధి కార్యక్రమాలు ముమ్మరంగా సాగుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ముచ్చు లయ యాదవ్, వైసిపి జోనల్ ఇన్‌ఛార్జులు అప్పారావు, రెడ్డి గురుమూర్తి, నాయకులు భోగాపురపు రవిచంద్ర, బాలి ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న మేయర్ విజయలక్ష్మి

గుంకలాం లేఅవుట్‌లో సౌకర్యాలు కల్పించాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

గుంకలాం వద్దనున్న జగనన్న లేఅవుట్‌లో కనీస సౌకర్యాలు కల్పించాలని జనసేన నాయకులు బుధవారం ఇఇ, డిఇఇకు వినతులు అందజేశారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు హుస్సేన్‌ఖాన్, యర్నాగుల చక్రవర్తి మాట్లాడుతూ రాష్ట్రంలోని అతి పెద్ద లేఅవుట్ అని ప్రభుత్వం గొప్పగా చెప్పుకునే గుంకలాం లేఅవుట్ పేరు గొప్ప ఊరు దిబ్బ అన్న చందంగా తయారైందన్నారు. పేదలు ఇళ్లు నిర్మించుకునేందుకు కనీస సదుపాయాలు లేక అవస్థలు పడుతున్నారని తెలిపారు. ఇల్లు నిర్మించుకునేందుకు నీటి సదుపాయం లేక బ్లాక్‌లో రూ.600 చొప్పున వాటర్ ట్యాంకులు కొనుక్కొని పనులు చేసుకుంటున్నారని తెలిపారు. వెంటనే ఈ దోపిడీని ఆపి, బోర్లు, హ్యాండ్ పంపులు ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై అధికారులు సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు. కార్యక్రమంలో జనసైనికులు భవాని, రమణ, పండు పాల్గొన్నారు.

కృష్ణ కుటుంబానికి ఎమ్మెల్యేల పరామర్శ

ప్రజాశక్తి- బాడంగి

ఇటీవల హత్యకు గురైన ఏగిరెడ్డి కృష్ణ మాస్టారు కుటుంబాన్ని బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి చిన్న అప్పలనాయుడు, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని తన ప్రగాఢ సంతాపం ప్రకటించారు. అనంతరం శంబంగి మాట్లాడుతూ కృష్ణ మాస్టారు చాలా ఏళ్లుగా తనతో ఎంతో సన్నిహితంగా ఉండేవాడని అలాంటి వ్యక్తి మరణ వార్త తన హృదయాన్ని కలచివేసిందని అన్నారు. కృష్ణ మాస్టార్‌ను హతమార్చిన వారిని కఠినంగా శిక్షించాలని పోలీస్ సిబ్బందిని ఆదేశించామన్నారు. రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు మాట్లాడుతూ కృష్ణ మాస్టారుది ఉద్దవోలు గ్రామం అయినప్పటికీ రాజాంలో ఉంటూ తనకు కొన్నేళ్లుగా పరిచయమని అలాంటి మంచి వ్యక్తి మరణించడం చాలా బాధాకరమని తెలిపారు.

23న వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరంలో ఈ నెల 23న పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తామని విశ్వకళాపరిషత్ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు చింతలపూడి త్రినాథరాథోక ప్రకటనలో తెలిపారు. విశ్వకళాపరిషత్ గ్రూపు, గురజాడ బ్రాహ్మణ సమాఖ్య, నా ఊరు విజయనగరం, వనితా వాకర్స్ క్లబ్, తిలక్ ఫౌండేషన్ సంయుక్తంగా కణపాక యూత్ హాస్టల్‌లో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 5,6,7, తరగతుల విద్యార్థులకు సమాజంపై అవినీతి ప్రభావం అనే అంశంపైన, 8,9,10 తరగతుల విద్యార్థులకు పర్యావరణం- చెరువుల పరిరక్షణ ఆవశ్యకత అనే అంశాలపై వ్యాసరచన పోటీ నిర్వహిస్తామని చెప్పారు. పాల్గొనే విద్యార్థులు 9866474519 నంబరును సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

చాగంటి తులసికి పురస్కారం

ప్రజాశక్తి-విజయనగరం



ప్రముఖ రచయిత్రి చాగంటి తులసికి బలివాడ కాంతారావు జీవిత సాఫల్య సాహిత్య పురస్కారం ప్రదానం చేయనున్నట్లు భారతనిధి ఫౌండేషన్ వ్యవస్థాపకులు డిఎస్‌వి గోపీకృష్ణ, నిర్వాహకులు ఎం.మస్తాన్ రెడ్డి, అడపా రామకృష్ణ తెలిపారు. ఈ నెల 22న స్థానిక పాల్‌నగర్‌లోని తులసి ఇంటి వద్ద అందజేయనున్నట్లు చెప్పారు. పురస్కారం కింద రూ.25 వేలు నగదు, జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందించనున్నట్లు వివరించారు. సాహితీ మిత్రులు ఈ పురస్కార వేడుకకు తరలి రావాలని నిర్వాహకులు కోరారు.

మహిళలకు రక్షణ కల్పించాలని నిరసన

ప్రజాశక్తి - గజపతినగరం

మహిళలపై జరుగుతున్న దాడులు, హింసలకు నిరసనగా తెలుగు మహిళ విభాగం అధ్యక్షులు గంట్యాడ శ్రీదేవి ఆధ్వర్యంలో మహిళా ఆత్మగౌరవ ర్యాలీ కార్యక్రమం బుధవారం సాయంత్రం నిర్వహించారు. స్థానిక టిడిపి నియోజకవర్గ కార్యాలయం నుండి నాలుగు కూడళ్ల జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించి మానవహారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వ పాలనలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. రాష్ట్రంలో ప్రతీ ఎనిమిది గంటలకు ఒక మహిళ హత్యాచారానికి గురవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. రోజుకు యాభై మంది మహిళల పై భౌతిక దాడులు జరుగుతున్నాయని, మైనరు బాలికల రేప్‌లలో దేశంలో రెండవ స్థానంలో ఆంధ్రప్రదేశ్ ఉందని, మిస్సింగ్ కేసులలో నూటికి డబ్బై మంది మహిళలే ఉన్నారని గుర్తు చేశారు. ప్రశ్నిస్తున్న మహిళల పై తప్పుడు కేసులు పెడుతూ వారి పై సోషల్ మీడియా వేదికగా అసభ్యకరంగా పోస్టులు పెడుతూ మానసికంగా హింసిస్తున్నారని మండిపడ్డారు. ఒకవైపు విద్యార్థులకు నాణ్యమైన చదువు ఇవ్వకపోగా ఇంకోవైపు పిల్లలకు గంజాయి ఇచ్చి నాశనం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా మహిళలే ఈ ప్రభుత్వాన్ని శాస్వతంగా సాగనంపుతారని అన్నారు. ఈ ర్యాలీలో టిడిపి మండల అధ్యక్షులు అట్టాడ లక్ష్మునాయుడు, రాష్ట్ర తెలుగు మహిళ కార్యనిర్వాహక కార్యదర్శి రొంగలి రమణమ్మ, మాజీ ఎంపిపి భీంపల్లి దేవుడమ్మ, పార్లమెంట్ ఉపాధ్యక్షులు వైకుంఠం మైథిలీ ప్రియాంక, బొండపల్లి తెలుగు మహిళ అధ్యక్షులు ముంజేటి పార్వతి, తదితరులు పాల్గొన్నారు.


గజపతినగరం: నిరసన ర్యాలీ చేస్తున్న టిడిపి నాయకులు

శృంగవరపుకోట: రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న దాడులపై టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ కోళ్ల లలితకుమారి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బుధవారం ఆమె పట్టణంలోని దేవి కూడలిలో విలేకరులతో మాట్లాడుతూ. 2024లో ఎలాగో వైసిపి ప్రభుత్వం రాదని అన్ని సర్వే రిపోర్టులు తెలపడంతో జగన్మోహన్ రెడ్డి దిగులుతో, వైసిపి 'పేటియం బ్యాచ్'లతో సోషల్ మీడియాలో తప్పుడు పోస్టులు పెట్టిస్తూ, మహిళలపై ఎదురుదాడులు చేయిస్తూ పైశాచిక ఆనందం పొందుతున్నారన్నారు. గత నాలుగేళ్లలో రోజు రోజుకీ మహిళలపై జరుగుతున్న దాడులు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గొర్లె కస్తుర్తి, దేవపల్లి ప్రభ, గనివాడ లక్ష్మీ, గన్ను బంగారమ్మ, పెదగాడ లక్ష్మి, పొడుగు నాగమణి, పొట్నూరు ధనలక్ష్మి, బీశెట్టి అరుణ, కార్యకర్తలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న దాడులు, హింసలకు సంబంధించి బుధవారం నెల్లిమర్ల తెలుగు మహిళల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. నగర పంచాయతీ పరిధిలో కనకదుర్గమ్మ ఆలయంలో పూజలు నిర్వహించి, ఆత్మగౌరవ ర్యాలీ చేశారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ అధ్యక్షులు బైరెడ్డి లీలావతి, నియోజకవర్గ మహిళ అధ్యక్షులు చిల్ల పద్మ, బొంతు ఉమ, చీకటి సుహాసిని, కోట్ల సునీత, లెంక హైమవతి, కాళ్ళ సత్యవతి, రెడ్డి సంతోషి, తదితరులు పాల్గొన్నారు.

జాబితా పరిశీలన బాధ్యత కన్వీనర్లదే

కొత్తవలస: ఓటర్ జాబితా వెరిఫికేషన్ బాధ్యత బూత్ కన్వీనర్లదేనని, అందుకు బూత్ కన్వీనర్లు సిద్ధం కావాలని ఎస్ కోట మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి అన్నారు. బుధవారం కొత్తవలసలో బూత్ కన్వీనర్లకు ఇంటిగ్రేషన్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలో ఓటర్ వెరిఫికేషన్ 99 శాతం, ఐడెంటిఫికేషన్ 80 శాతం మాత్రమే పూర్తయిందన్నారు. మిగిలినవి పూర్తి చేయాల్సిన బాధ్యత బూత్ కన్వీనర్లపై ఉందన్నారు. వీలైనంత త్వరగా శతశాతం ఈ ప్రక్రియ పూర్తయ్యే విధంగా బూత్ కన్వీనర్లు సహకరించాలన్నారు. ఇంటిగ్రేషన్ శిక్షణ కార్యక్రమంలో సీనియర్ నాయకులు బుచ్చిరాంప్రసాద్, ఆర్‌టిఐఎస్ నియోజకవర్గ ఇంచార్జ్ చెక్కా కిరణ్ కుమార్, చీపురుపల్లి సాగర్ కళ్యాణ్, భూమిరెడ్డి మోహన్ రాజు, 68 పోలింగ్ కేంద్రాల బూత్ కన్వీనర్లు హాజరయ్యారు.

వికలాంగ విద్యార్థుల వివరాల నమోదు

రామభద్రపురం: అన్ని ప్రభుత్వ స్కూల్స్‌లో చదువుతున్న వికలాంగ విద్యార్థుల వివరాలను ప్రశస్త్ యాప్‌లో ఉపాధ్యాయులు నమోదు చేయాలని ఎంఇఒ తిరుమల ప్రసాద్ ఆదేశించారు. ఈ యాప్ ద్వారా నమోదు అయ్యే వారికి వైద్య సదుపాయాలు, సంక్షేమ పథకాలు పొందే అవకాశముందన్నారు. ఈ ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ ను ఈ నెల 28 లోగా చేసేందుకు అన్ని పాఠశాలల ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. తొలిరోజు మండల కేంద్రంలో ఉన్న వివిధ పాఠశాలల్లో ఈ కార్యక్రమాన్ని ఆయా ఉపాధ్యాయులు ప్రారంభించి విద్యార్థుల వివరాలు నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో ఐఈఆర్‌టిపిఎటి రావు, ప్రత్యేక ఉపాధ్యాయిని కళావతి పాల్గొన్నారు.

టీకాలపై అవగాహన

బొబ్బిలి: మాతా శిశుసంరరక్షణ, ఆరోగ్య పరిరక్షణలో భాగంగా నవజాత శిశువులకు ఇప్పించే టికాల విషయంలో ప్రతి తల్లీ, గర్భిణులకు అవగాహన కలిగి ఉండాలని పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ సునీల్ కుమార్ అన్నారు. బుధవారం స్థానిక ఎన్‌ఆర్ఐ వైద్యశాలలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మాత శిశుసంరక్షణలో భాగంగా తల్లులకు, గర్భిణులకు నవజాత శివులకు టీకాలు, తల్లి పాల ఆవశ్యకత పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రోటరీ అధ్యక్షులు జెసి రాజు మాట్లాడుతూ అంతర్జాతీయ రోటరీ సంస్థ జులై నెలను మెటర్నల్, చైల్డ్ హెల్త్ నెలగా నిర్వహిస్తోందన్నారు. ఈ కర్యాక్రమంలో వైద్యులు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

వర్షాలకు కూలిన పెంకుటిల్లు

బొబ్బిలి: బొబ్బిలిలో కురిసిన వర్షాలకు రాతిపనివారిగట్టు వీధిలో పెంకిటిల్లు కూలిపోయింది. ఆ వీధిలో నివాసముంటున్న మంతిన వరలక్ష్మి ఇల్లు వర్షాలకు నానిపోవడంతో ఒక్కసారిగా పై కప్పు కూలిపోయింది. ఇల్లు కూలిపోవడంతో వర్షం కారణంగా వరలక్ష్మి, కుటుంబ సభ్యులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం స్పందించి తమను ఆదుకోవాలని వరలక్ష్మి కోరారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

గజపతినగరం: అగ్ని ప్రమాదాలు సంభవించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్టేషన్ ఫైర్ ఆఫీసర్ ఎం.ఎస్.వి రవి ప్రసాద్ అన్నారు. బుధవారం ముందస్తు భద్రత చర్యల్లో భాగంగా స్థానిక ఆర్కే ఫ్యామిలీ మార్ట్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బందికి, కొనుగోలుదారులకు అగ్ని ప్రమాదాల పట్ల తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు. ఇటువంటి మార్టులలో ఏలక్ట్రికల్ అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు తొందరపాటుకు గురికాకుండా వాటిని ఆరిపే ఎక్స్టింగ్ విషర్సన్ ఏ విధంగా వినియోగించి మంటలను అదుపు చేయాలో ప్రయోగించి అర్థమయ్యేలా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

కొళాయి పనులకు భూమిపూజ

గుర్ల: మండలంలోని రాగోలు గ్రామంలో బుధవారం ఇంటింటా కొళాయి పనులకు జెడ్‌పిటిసి సీర అప్పలనాయుడు, వైసిపి నాయకులు పొట్నూరు సన్యాసినాయుడు, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి కెవి సూర్యనారాయణ రాజు భూమి పూజ చేశారు. ఇంటింటి కొళాయి పనులకు రూ. 55 లక్షలు మంజూరు చేసినట్లు వారు తెలిపారు. ప్రతి ఇంటికి నాణ్యమైన సురక్షితమైన తాగునీరు అందించడం ప్రభుత్వ లక్ష్యంమని అన్నారు. ఈ కార్యక్రమంలో పశుగణాభివృద్ధి చైర్మన్ బెల్లాన బంగారు నాయుడు, ఎంపిటిసి రామకృష్ణ, రమేష్, జమ్ముపేట సొసైటీ చైర్మన్ శ్రీనివాసు, గొలగం సర్పంచ్ కలిశెట్టి అప్పలరాజు పాల్గొన్నారు.

పండ్ల మొక్కలను పరిశీలించిన ఎపిఒ

గజపతినగరం: ఉపాధి హామీ పనుల్లో భాగంగా దావాలపేటలో నాటిన పండ్ల మొక్కలను ఎపిఒ సిహెచ్. రామారావు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో 70 సెంట్లులో 49 మామిడి మొక్కలను నాటామన్నారు. వాటి సంరక్షణకై లబ్ధిదారునికి రూ.30 అందించామని చెప్పారు. ఆసక్తి ఉన్న చిన్నా సన్నకారు రైతులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బీజామృతంతో ప్రయోజనాలు

నెల్లిమర్ల: బీజామృతంతో రైతులకు ప్రయోజనాలు కలుగుతాయని ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇంఛార్జి వర్రి గాయత్రి తెలిపారు. బుధవారం చీపురుపల్లి డివిజన్ వల్లూరు యూనిట్ ఒమ్మి గ్రామంలో రైతులకు గాయత్రి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గాయత్రి మాట్లాడుతూ వరి విత్తనాలు వేసుకునే ముందు బీజామృతం తయారు చేసుకోవాలని సూచించారు.బీజా మృతం వల్ల భూమిలో ఎటువంటి చీడపీడలు, విత్తనాలకు సోకకుండా చేసి మొలకశాతం బాగా వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో యూనిట్ ఐసిఆర్‌పిఎస్ ఏ.రామలక్ష్మి, కె.లక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

ఫ్రైడే డ్రై డే తప్పనిసరి

నెల్లిమర్ల: నగర పంచాయతిలో ఫ్రైడే డ్రై డే తప్పని సరిగా అమలు చేయాలని కమిషనర్ పి.బాలాజీ ప్రసాద్ సూచించారు. బుధవారం స్థానిక కార్యాలయంలో ఫ్రై డే డ్రై డే పై సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డెంగీ, మలేరియా, ఇతర వ్యాధులు ప్రబలకుండా ప్రజలకు పూర్తిగా అవగాహన కల్పించాలని ఆదేశించారు. సంపూర్ణ పారిశుధ్య నిర్వహణ పనులు జరిపి, వర్షాకాలం దృష్ట్యా నగర పంచాయతీ పరిధిలో ఫీవర్ సర్వే చేపట్టాలన్నారు. వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో మేనేజర్ టివిఎస్ విశ్వేశ్వరరావు, మెప్మా సిఎంఎం డి.గోవింద రావు, సానిటరీ కార్యదర్శులు, ఎఎన్ఎం, ఆశాలు, మెప్మా ఆర్పీలు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి

కొత్తవలస: విద్యార్థులు క్రమశిక్షణతో మెలిగి, ఉన్నత శిఖరాలకు ఎదగాలని కొత్తవలస ఎస్ఐ హేమంత్ కుమార్ అన్నారు. స్థానిక రవీంద్ర భారతి హైస్కూల్లో విద్యార్థులకు బుధవారం వందనం వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకల్లో ఆరవ తరగతి నుండి పదో తరగతి వరకు విద్యార్థులు పాల్గొన్నారు. అందులో భాగంగా పాఠశాలలో కొంతమంది విద్యార్థులను ఎంపిక చేసి వారికి ఎస్‌పిఎల్, ఎఎస్‌పిఎల్, లిటరేచర్, స్పోర్ట్స్ కల్చరల్ మొదలైన క్యాబినెట్ మెంబర్స్‌గా ఎంపిక చేసి ఆయా విభాగాలకు విద్యార్థినీ విద్యార్థులకు లీడర్షిప్ నాయకత్వ బాధ్యతను అప్పగించారు. వీరికి ఎస్ఐ చేతులు మీదగా ఆయా విభాగాల విద్యార్థులకు బ్యాడ్జెస్ ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ నిషా, డీన్ సంతోష్ కుమార్, జిఎం రమ్య, ఎజిఎం జగదీష్ జనరల్ ఇంచార్జ్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

స్వర్గధామం అభివృద్ధికి వితరణ

నెల్లిమర్ల: నగర పంచాయతి పరిధి జరజాపు పేటకు చెందిన స్వర్గాదామం అభివృద్ధికి గ్రామానికి చెందిన బోలె కుటుంబ సభ్యులు ఆర్థిక వితరణ అందజేశారు. బుధవారం కీర్తిశేషులు బోలె రాము నాయుడు కుమారులు బోలె శంకర రావు, రమణా రావు మాస్టర్, త్రినాథరావు స్వర్గాదామం అభివృద్ధికి రూ.2లక్షలు గ్రామ పెద్దలకు అందజేశారు. ఈ సందర్భంగా స్వర్గదామంలో అభివృద్ధి పనులను కొబ్బరి కాయ కొట్టి నరగపంచాయతీ వైస్ చైర్మన్ రామారావు ప్రారంభించారు. స్వర్గీయ బోలె రామునాయుడు స్థానిక జ్యూట్ మిల్లులో పనిచేస్తూ నాటక రంగంలో కళాకారుడిగా సేవలు అందించారు. కాగా తన తండ్రి గుర్తింపుగా కుమారులు స్వర్గదామం అభివృద్ధికి ఆర్థిక వితరణ చేసినందుకు గ్రామ పెద్దలు, గ్రామస్థుల కృత్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు నల్లి చంద్ర శేఖర్, అవనాపు సత్యనారాయణ, కిల్లంపల్లి రామారావు, ఎంఎం నాయుడు, తాలాడ సన్ని బాబు, బోలె రామ కృష్ణ, మద్దిల శ్రీను, బోలె పైడి రాజు, బోని సత్య నారాయణ తదితరులు పాల్గొన్నారు.

బంగారు నాయుడుకు ఎమ్మెల్సీ నివాళి

నెల్లిమర్ల: నగర పంచాయతీ పరిధి జరజాపుపేటకు చెందిన రిటైర్డ్ ప్రిన్సిపాల్ బోని బంగారు నాయుడు మాష్టారుకి ఎమ్మెల్సీ డాక్టర్ సురేష్ బాబు బుధవారం నివాళి అర్పించారు. జరజాపుపేటలో ఏర్పాటు చేసిన సంతాప సభలో పాల్గొన్న ఎమ్మెల్సీ బంగారు నాయుడు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యారంగానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. వేలాదిమంది విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దిన ఘనత ఆయనకు దక్కుతుందన్నారు. బంగారు నాయుడుకి నివాళులర్పించిన వారిలో కుమారుడు ఇరిగేషన్ డిఇ బోని శ్రీనివాసరావు, నగర పంచాయతీ వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, నల్లి చంద్ర శేఖర్, ఎం ఎం నాయుడు, మద్దిల ప్రసాద్ (పోలీస్) మిమ్స్ హెచ్ ఆర్ ఆరిపాక శ్రీనివాసరావు, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

మున్సిపల్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి

ప్రజాశక్తి- బొబ్బిలి

మున్సిపల్ అవుట్ సోర్సింగ్ అండ్ కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు పి. శంకరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం మున్సిపల్ కమిషన ర్‌కు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు జగన్మోహన్ రెడ్డి తాను అధికారంలోకి వస్తే కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేస్తానని చెప్పి ఇప్పుడు పట్టించుకోలేదన్నారు. ఇది నమ్మిన రాష్ట్రంలో 40 వేల మంది మున్సిపల్ కార్మికులు వైసిపికి ఓట్లు వేసి అధికారం ఇచ్చారని 4 సంవత్సరాలు దాటిన వీళ్ళను పర్మినెంట్ చేయకపోవడం సిగ్గుచేటన్నారు. సమాన పనికి సమాన వేతనం 010 కింద జీతాలు చెల్లించాలని రాష్ట్ర వ్యాప్తంగా కార్మికులందరూ జూలై 20న మున్సిపల్ ఆఫీసు ముందు నిరాహార దీక్ష జూలై 27 మున్సిపల్ ఆఫీసులు ముట్టడి, ఆగస్టు 7 కలెక్టర్ ఆఫీస్ ధర్నా చేపడతామన్నారు. అప్పటికీ ప్రభుత్వ స్పందించకపోతే నిరవధిక సమ్మెలోకి వెళ్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు జి. గౌరీ, కార్యదర్శి జె. రామారావు, కమిటీ సభ్యులు బి. వెంకటి, యుగంధర్, బి. వెంకటరమణ పాల్గొన్నారు.


కమిషనర్‌కు వినతి పత్రమిస్తున్న సిఐటియు నాయకులు

నెల్లిమర్ల: మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని మున్సిపల్ యూనియన్ జిల్లా నాయకులు ఎ.జగన్మోహన్‌రావు కోరారు. కార్మికులకు జీవో నెంబర్ 7 ప్రకారం వేతనాలు చెల్లించాలని, హెల్త్ అలవెన్సు ఇవ్వాలని, పనిముట్లు రక్షణ పరికరాలు తదితర డిమాండ్లపై ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా నెల్లిమర్ల నగర పంచాయతీ వద్ద జులై 21న రిలే నిరాహార దీక్ష, జూలై 27న నగర పంచాయతీ ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఆయన వెల్లడించారు. అనంతరం నగర పంచాయతీ నాయకులు బాబురావు దుర్గారావు, లక్ష్మి, హరితతో కలిసి కమిషనర్ బాలాజీ ప్రసాద్‌కు వినతి పత్రాన్ని అందించారు.

సమగ్రమైన చట్టం చేయాలి

ప్రజాశక్తి- వంగర

అసంఘటిత రంగ కార్మికులకు సమగ్రమైన చట్టం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి సిహెచ్ రామ్మూర్తినాయుడు డిమాండ్ చేశారు. రాజాం బజారులో బుధవారం కళాశీలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అసంఘటిత రంగ కార్మికులను కనీసం పట్టించుకోవడం లేదన్నారు. లక్షలాదిమంది కళాసి, ఆటో, రిక్షా, తోపుడు బళ్ళు కార్మికులు ఎటువంటి భద్రతా లేకుండా పనిచేస్తున్నారని వీళ్లకు తక్షణమే సమగ్రమైన చట్టం చేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రాజాం బజార్లో పనిచేస్తున్న లోడింగ్ అన్‌లోడింగ్ కళాశీలకు యజమానులు కూలి రేట్లు పెంపుదల చేయకుండా గత మూడు నాలుగు సంవత్సరాలుగా తీవ్రమైన ఇబ్బందులకు గురిచేస్తూ శ్రమదోపిడి చేస్తున్నారన్నారు. కూలి రేట్లు పెంపుదల చేయాలన్న యజమానులు చాలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ వాయిదాలు వేస్తూ వస్తున్నారని, తక్షణమే కూలి రేట్లు పెంపుదల చేయకపోతే పోరాటానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. రాష్ట్రంలో కోటి మంది అసంఘటిత కార్మికులకు ప్రభుత్వ భాగస్వామ్యంతో పిఎఫ్ కల్పించాలని, బడ్జెట్లో కార్మికుల సంక్షేమానికి అవసరమైన నిధులను కేటాయించాలని కోరారు.

ప్రజా ప్రతినిధులకు సమాచారమివ్వాలి

ప్రజాశక్తి- దత్తిరాజేరు

ప్రజలకు అందించే ప్రభుత్వ పథకాల సమాచారాన్ని ముందుగా ప్రజాప్రతినిధులకు తెలియజేయాలని ఎంపిపి గేదెల సింహాద్రి అప్పలనాయుడు అన్నారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో బుధవారం ఎంపిడిఒ ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. తొలుత వ్యవసాయాధికారి అనురాధ వ్యవసాయ శాఖ పరమైన అంశాలపై వివరించారు. మండలంలో ఇప్పటి వరకు ఎనిమిది రైతు భరోసా కేంద్రాలు మాత్రమే భవనాలు అందుబాటులో ఉన్నాయని, ఇంగిలాపల్లి, పెదమానాపురం, వంగర, పాచిలవలస గ్రామాలలో భవనాలు పూర్తి చేసినప్పటికీ ప్రారంభం కాలేదని తెలిపారు. గడసాంలో రైతు భరోసా కేంద్రం ఉన్నప్పటికీ, పోరలి రైతు భరోసా కేంద్రానికి వెళ్లి, విత్తనాలు ఎరువులు తీసుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారని గడసాం, ఎం లింగాలవలస, సర్పంచ్, ఎంపిటిసిలు ఎఒ దృష్టికి తీసుకెళ్లగా సిబ్బంది కొరత వల్ల కొంత సమస్యగా ఉందని ఆమె వివరణ ఇచ్చారు. దత్తిరాజేరు, కే కొత్తవలస వైద్యాధికారులు సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. మరడాం గ్రామంలో తొలి డెంగీ కేసు నమోదైందని, గ్రామాల్లో అప్రమత్తం చేస్తున్నామని తెలియజేశారు. రెవెన్యూ పరమైన సమస్యలు ఏమైనా ఉంటే నేరుగా ప్రజా ప్రతినిధులు తన దృష్టికి తీసుకువస్తే సకాలంలో పరిష్కరిస్తానని తహశీల్దార్ గురుమూర్తి తెలిపారు. మండలంలోని 36 గ్రామపంచాయతీలు పరిధిలో 194 గ్రూపులకు 7 కోట్లు రుణాలు బ్యాంకు ద్వారా ఇప్పించామని, శ్రీనిధి 5 కోట్లు టార్గెట్ ఆదేశించగా కోటి యాభై లక్షల వరకూ చేశామని వెల్లడించారు. ఈ సమావేశంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే

ప్రజాశక్తి - బొబ్బిలిరూరల్

రైతు సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం అనేక సంస్కరణలు తీసుకువచ్చి రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. మండలంలోని కారాడ గ్రామంలో రూ.21లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు అవసరమయ్యే విత్తనాలు, ఎరువులు రైతు భరోసా కేంద్రాల్లో లభిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి శంబంగి లక్ష్మి, వేణుగోపాలనాయుడు, జెడ్‌పిటిసి శాంత కుమారి, వైస్ ఎంపిపి డోకల జ్యోతి, నాయకులు సంజీవ నాయుడు, పిఎసిఎస్ అధ్యక్షులు చెలికాని రాజగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

వేపాడ : మండలంలోని సోంపురంలో రైతు భరోసా కేంద్రాన్ని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ ఇందుకూరు రఘురాజు చేతులు మీదుగా బుధవారం ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం ఇస్తున్న సంక్షేమ పథకాలు పేదలకు ఎంతో ఉపయుక్తంగా ఉంటున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మురిపిండి గంగరాజు, కొత్తవలస మార్కెటింగ్ కమిటీ చైర్మన్ మూకల కస్తూరి, జెడ్‌పిటిసి ఎస్.అప్పలనాయుడు, ఎంపిపి డి. సత్యవంతుడు, వైస్ ఎంపిపి అడప ఈశ్వరరావు, ఎంపిటిసిలు టి.వి రమణ, ఆకుల సత్యనారాయణ, వైసిపి మండల అధ్యక్షుడు ఎం.జగన్నాథం, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు ఎన్. వెంకట్రావు వైసిపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.


వేపాడ: సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

టిడిపితోనే భవిష్యత్తుకు గ్యారెంటీ

శృంగవరపుకోట: తెలుగుదేశం పార్టీతోనే భవిష్యత్తుకు గ్యారెంటీ ఉంటుందని టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ అన్నారు. 'భవిష్యత్తుకు గ్యారంటీ', మినీ మానిఫెస్టో ప్రచార కార్యక్రమంలో భాగంగా మండలంలోని చిన్నకండేపల్లి గ్రామంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తుకు గ్యారంటీ నినాదంతో ప్రజల్లోకి వెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మెరపురెడ్డి శ్రీను, గణేష్, రాయివరపు చంద్రశేఖర్, జుత్తాడ రామసత్యం,ఆడారి ఉమామహేశ్వరరావు, గనివాడ సన్యాసినాయుడు, కోరుకొండ శ్రీనివాస్ రావు, తదితరులు పాల్గొన్నారు.

పాల్తేరులో గడపగడపకు..

బాడంగి: మండలంలోని పాల్తేరు గ్రామంలో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంబంగి చిన్న అప్పలనాయుడు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పథకాలు గురించి వివరించారు. గ్రామ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వివేకా, ఎంపిటిసి దివ్య, నాయకులు రామారావు, మరిపి శంకర్ రావు, తెంటు మధు సూదన్, మండల అధికారులు, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.


పథకాలు గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే

ఆలయ నిర్మాణానికి రూ.25వేల విరాళం

డెంకాడ: మండలంలోని అమకాం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న అభయాంజనేయ స్వామి ఆలయానికి మాజీ ఎంపిపి కంది చంద్రశేఖర రావు రూ. 25వేలు విరాళం అందించారు. అక్కివరంలోని తన స్వగృహంలో ఆలయ కమిటీ పెద్దలకు బుధవారం ఈ విరాళాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో దిండి సురేంద్ర, దుర్గాసి చిన్న రమణ, సత్యం పాత్రుడు తదితర నాయకులు, యువత పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ

వేపాడ: మండలంలోని కడకొండ, చిన దుంగాడ పాఠశాలల్లో చదువుతున్న 23 మంది విద్యార్థులకు బుధవారం నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. అనకాపల్లి జిల్లా కె.కోటపాడు మండలం, ఎ.కోడూరు, పొడుగుపాలెం దొగ్గ మల్లమ్మ సర్వీస్ అండ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోట్‌పుస్తకాలు, పెన్సిల్స్, పలకలను పంపిణీ చేశారు.

అక్రమ మద్యం పట్టివేత

గుర్ల: మండలంలో జమ్ము గ్రామంలో పోలీస్‌లు నిర్వహించిన దాడులలో అక్రమంగా మద్యం అమ్ముతున్న వ్యక్తి నుండి 28 మద్యం సీసాలు స్వాధీనం చేసుకొని వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ హరిబాబునాయుడు తెలిపారు. అక్రమంగా మద్యం అమ్ముతున్న వ్యక్తి పై ఎఫ్ఐఆర్ నమోదు చేశామన్నారు. మండలంలో ఏ గ్రామంలో నైనా చట్ట విరుద్ధంగా మద్యం అమ్మకాలు చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఇళ్లు ప్రారంభించకపోతే పట్టాలు రద్దు

బొబ్బిలి: స్థానిక ఐటిఐ కాలనీలోని జగనన్న లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణ పనులను నెలాఖరులోగా ప్రారంభించకపోతే పట్టాలు రద్దు చేస్తామని మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు హెచ్చరించారు. మున్సిపల్ కార్యాలయంలో బుధవారం జగనన్న ఇళ్ల నిర్మాణంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెలాఖరులోగా ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించకపోతే పట్టా స్వాధీనం బోర్డులు ఏర్పాటు చేస్తామని హెచ్చరించారు. పేదల సొంతింటి కలను నిజం చేసేందుకు ప్రభుత్వం జగనన్న ఇళ్లను మంజూరు చేసిందని, నిర్మాణ పనులు పూర్తి చేసుకుని సొంతింటి కలను సాకారం చేసుకోవాలని కోరారు. ఇళ్ల నిర్మాణాల్లో జాప్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని ఉద్యోగులను హెచ్చరించారు. లబ్దిదారులు వద్దకు వెళ్లి ఇళ్ల నిర్మాణాలపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఉద్యోగులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహ సమస్యలు పరిష్కరించాలి

బొబ్బిలిరూరల్ : మండలంలోని వున్న వసతి గృహల సమస్యలు, స్థానిక సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పి.రామ్మోహన్ మాట్లాడుతూ బొబ్బిలి పట్టణంలో ఉన్న సంక్షేమ హాస్టల్స్‌కి సంబంధించి పెండింగ్‌లో ఉన్న మెస్, కాస్మొటిక్ చార్జీలను వెంటనే విడుదల చేయాలన్నారు. మార్కెట్ ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు పెంచాలని, సంక్షేమ హాస్టల్స్‌లో రెగ్యులర్ వార్డెన్స్, వర్కర్స్‌ని నియమించాలని, పట్టణానికి దూరంగా కోమటిపల్లిలో ఉన్న బిసి అబ్బాయిల హాస్టల్‌ని బొబ్బిలి పట్టణంలోకి తరలించాలని డిమాండ్ చేశారు. బొబ్బిలి రైల్వే ట్రాక్ వెలుపల ఉన్న ఎస్‌టి అమ్మాయిల హాస్టల్‌ని కూడా బొబ్బిలి టౌన్‌కి తీసుకురావాలని, లేదంటే రానున్న కాలంలో రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా వ్యాప్తంగా తీవ్ర ఆందోళన చేస్తామని హెచ్చరించారు. బొబ్బిలి ఎస్‌సి అబ్బాయిల సంక్షేమ హాస్టల్‌లో అసభ్యంగా వ్యవహరిస్తున్న వాచ్‌మెన్ పై చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ డివిజన్ నాయకులు హరికృష్ణ, సిహెచ్.వాసు, ఎస్ఎఫ్ఐ మండల కమిటీ ప్రెసిడెంట్ కే.మణి కుమార్, మండల కమిటీ సభ్యుల కే.దావీదు, తేజ విద్యార్థులు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ బీమా చెక్కు అందజేత

రేగిడి: మండలంలోని పెద్దశిర్లాం గ్రామంలో ఇటీవల గుండెపోటుతో మరణించిన బెజ్జిపురపు ఆదినారాయణ (41) కుటుంబానికి వైఎస్ఆర్ బీమా తక్షణ సహాయం కింద రూ.10వేలను బుధవారం గ్రామ సర్పంచ్, వైసిపి నాయకులు లెంక రాంబాబు అందించారు. ప్రమాదవశాత్తు కుటుంబ యజమాని మరణిస్తే ఆ కుటుంబం వీధిన పడకుండా వైయస్సార్ భీమా ఎంతో భరోసా ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్ సుదీర్, గ్రామ పెద్దలు ఉన్నారు.

ధ్రువపత్రాలు పంపిణీ

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని చిన్నశిర్లాం గ్రామ సచివాలయం లో జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే కంబాలు జోగులు చేతులు మీదుగా ఉచితంగా ప్రజలకు ధ్రువపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న సురక్ష వల్ల మరిన్ని ప్రభుత్వ పథకాలు అందే అవకాశం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమాన్ని వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రాజాం టౌన్ వైసిపి కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు, వైస్ ఎంపిపిలు టంకాల అచ్చెంనాయుడు, వావిలపల్లి జగన్, వైసిపి నాయకులు రెడ్డి నరసింగరావు, లెంక రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

వేపాడ: మండలంలోని కుమ్మపల్లి, సోంపురం గ్రామాలలో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి దొగ్గ సత్యవంతుడు మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు ఎంతో మేలు జరుగుతోందన్నారు. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచులు అరుణ, మురిపిండి గంగరాజు వైస్ ఎంపిపి అడప ఈశ్వరరావు, కె.ఆర్.పేట సర్పంచ్ చెలిబోని ముసలినాయుడు, మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు నిరుజోగి వెంకట్రావు, తహశీల్దార్ ప్రశాంత్ కుమార్, ఎంపిడిఒ పట్నాయక్, డిప్యూటీ తహశీల్దార్ సన్యాసినాయుడు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు బాగుచేయాలని ధర్నా

ప్రజాశక్తి - కొత్తవలస

నియోజకవర్గంలో రోడ్ల గుంతలకు నిరసిస్తూ కొత్తవలస జంక్షన్ కూడలి నుంచి విజయనగరం వెళ్లే రోడ్డు వైపు అఖిలపక్ష పార్టీల ఆధ్వర్యంలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఎస్‌కోట మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం నాలుగేళ్ళ పాలనలో రాష్ట్రంలో ఎక్కడ చూసినా నాణ్యత లేక ప్రభుత్వ గుత్తేదార్లు డబ్బులకు ఆశపడి రోడ్ల నిర్మాణంలో నాణ్యత లోపించిందని ఆరోపించారు. శృంగవరపుకోట నియోజకవర్గంలో కొత్తవలస మండల కేంద్రం నుండి విజయనగరం వెళ్లే రోడ్డు తేలికపాటి వర్షాలకే అస్తవ్యస్తంగా తయారవుతోందన్నారు. అనంతరం తహశీల్దార్‌కి వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి కోళ్ల వెంకటరమణ, మండల పార్టీ ఉపాధ్యక్షులు ఎల్లపు సూరిబాబు, ప్రధాన కార్యదర్శి కనకాల శివ, టిడిపి రాష్ట్ర అయ్యారక సాధికార సమితి కన్వీనర్ బంగారు రమేష్, టిడిపి విశాఖ పార్లమెంటరీ కార్యనిర్వాహక కార్యదర్శి కొరుపోలు అప్పారావు, జనసేన నాయకులు, బిఎస్‌పి, లోక్ సత్తా, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.